క్లుప్తంగా

విద్యార్థినులను అభినందించిన కలెక్టర్



దెందులూరు బాలసదనం విద్యార్థినులతో కలెక్టర్ వెట్రిసెల్వి

దెందులూరు: పరీక్షలు ఎలా రాశారు. మార్కులు ఎలా వస్తున్నాయి. మళ్లీ నేను దెందులూరు బాల సదనానికి వస్తానంటూ కలెక్టర్ కే వెట్రిసెల్వి దెందులూరు బాల సదనం విద్యార్థినులను పలకరించారు. ఏలూరులో జాతీయ బాలిక దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం సెయింట్ ఆన్స్ కళాశాలలో దెందులూరు బాలసదనం బాలికలు ప్రత్యేక నృత్య ప్రదర్శన చేశారు. కలెక్టర్ వేదిక నుంచి వారి వద్దకు వెళ్లి వారి అభినందించి పలకరించడంతో ఒక్కసారిగా విద్యార్థినులు పట్టలేని సంతోషం వ్యక్తం చేశారు. దెందులూరు బాలసదనం సూపరింటెండెంట్ సరోజిని ఉన్నారు.

గ్రామాభివృద్ధికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న సబ్ రిజిస్ట్రార్ వి.రాఘువేంద్రప్రసాద్

భీమడోలు: పాతూరు గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు తన వంతు కృషి చేస్తానని భీమడోలు సబ్ రిజిస్ట్రార్ వి.రాఘవేంద్ర ప్రసాద్ అన్నారు. సూరప్పగూడెం పంచాయతీ పరిధిలోని పాతూరు గ్రామాన్ని దత్తత తీసుకున్న నేపథ్యంలో శుక్రవారం సాయంత్రం గ్రామస్తులు, పెద్దలతో ఆయన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో నెలకొన్న సమస్యలను ఆయన అడిగి తెలుసుకున్నారు. గ్రామంలోని ప్రజలందరికీ అవసరమైన మౌలిక వసతుల కల్పనకు తన వంతు సహాయ సహకారాలను అందిస్తామన్నారు. గ్రామాభివృద్ధికి ఓ ప్రణాళికను తయారు చేసుకుని దానికి అనుగుణంగా ప్రాధాన్యత క్రమంలో వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి ఎం.ముత్తయ్య, గ్రామ పెద్దలు వెజ్జు నాగేశ్వరరావు, వెజ్జు రాంబాబు, ప్రభాకరరావు పాల్గొన్నారు.

కోయ గిరిజనులకు న్యాయం చేయాలి

ఏలూరు (టూటౌన్): జీలుగుమిల్లి మండలం సిర్రివారిగూడెం కోయగిరిజనులకు న్యాయం చేయాలని కోరుతూ జిల్లా జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డికి సీపీఎం ఏలూరు జిల్లా కమిటీ తరుపున జిల్లా కార్యదర్శి ఎ.రవి శుక్రవారం వినతి పత్రం అందజేశారు. సిర్రివారిగూడెంలో 14.70 ఎకరాల భూమిని గత 30 ఏళ్లుగా స్థానిక గిరిజనులు సాగు చేసుకుంటున్నారని తెలిపారు. ఇటీవల గిరజనేతర భూస్వామి కోడూరు కృష్ణవేణి సదరు భూమిని తాను కొనుగోలు చేశానని గిరిజనులను సాగును అడ్డుకుంటున్నారని పేర్కొన్నారు. తహసీల్దార్, ఆర్డీఓల నుంచి ప్రొటెక్షన్ ఆర్డర్లతో పోలీసుల సహకారంతో భూమిలోకి ప్రవేశించి గిరిజనులను భీతావహులను చేస్తున్నారని వివరించారు. గిరిజనులు సాగు చేస్తున్న భూమికి రక్షణ కల్పించాలని రవి డిమాండ్ చేశారు.

గీత కార్మికులకు మద్యం షాపుల కేటాయింపు



మద్యం షాపుల కేటాయింపు నిర్వహిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

ఏలూరు(మెట్రో): ఏలూరు జిల్లాలో గీత కార్మికులకు మొత్తం 14 షాపులను లాటరీ విధానంలో కేటాయించారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో లాటరీ తీశారు. గౌడ సామజిక వర్గానికి నూజివీడు మున్సిపాలిటీ పరిధిలోని షాపు, చింతలపూడి రూరల్ ప్రాంతంలోని షాపులు, ఏలూరు మున్సిపల్ కార్పొరేషన్, టి.నర్సాపురం, దెందులూరు, జంగారెడ్డిగూడెం రూరల్ పరిధిలో షాపులు, శెట్టిబలిజ సామజిక వర్గానికి జంగారెడ్డిగూడెం మున్సిపాలిటీ, చింతలపూడి, చాట్రాయి, ముసునూరు, మండవల్లి, నిడమర్రు, అగిరిపల్లి, కొయ్యలగూడెం మండలాల పరిధిలోని షాపులను కేటాయించారు. దరఖాస్తుకు గడువు ఫిబ్రవరి 5 వరకూ ఉందని, ఫిబ్రవరి 7 ఉదయం 10 గంటలకు లాటరీ పద్ధతిన దరఖాస్తుదారులను ఎంపిక చేసి షాపులను మంజూరు చేస్తామన్నారు.

పోలీస్ సంక్షేమ దివస్

ఏలూరు టౌన్: పోలీస్ సిబ్బంది స్వేచ్ఛగా ప్రజలకు సేవలు అందించేలా చర్యలు చేపడుతున్నామని ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిషోర్ తెలిపారు. ఏలూరు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో శుక్రవారం ఆయన సంక్షేమ దివస్‌ను నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా ఆయా పోలీస్‌స్టేషన్లలో పనిచేస్తున్న పోలీస్, ఏఆర్ సిబ్బంది, హోంగార్డులు తమ సమస్యలను ఎస్పీకి విన్నవించారు. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎస్పీ భరోసా కల్పించారు. సంక్షేమ దివస్‌లో ప్రధాన కార్యాలయ అధికారి స్మాలన్‌రాజు, సిబ్బంది ఉన్నారు.

ఓటర్ల లెక్క.. పక్కా

- గత ఎన్నికల కన్నా పెరిగిన ఓటర్ల సంఖ్య
- పురుషుల కన్నా అతివల ఓట్లే ఎక్కువ
- నేడు జాతీయ ఓటర్ల దినోత్సవం
- ఓటు హక్కు ప్రాధాన్యతపై అవగాహన సదస్సులు

భీమడోలు: ఉంగుటూరు నియోజకవర్గ ఓటర్ల లెక్క తేలింది. ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం సాధారణ ఎన్నికలతో పోల్చితే నియోజకవర్గంలో స్వల్పంగా 69 మంది ఓటర్లు పెరిగారు. నియోజకవర్గంలో పురుష ఓటర్ల కన్నా మహిళల ఓటర్ల ఎక్కువ. యువ ఓటర్లు సంఖ్య పెరిగింది. దీనితో గత మే నాటికి నియోజకవర్గంలో 2,06,437 ఓటర్ల కాగా ప్రస్తుతం 2,06,506 ఓటర్లకు చేరింది. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ 2025కు సంబంధించి తుది జాబితాను రాష్ట్ర ఎన్నికల అధికారులు విడుదల చేసారు. దీనితో జాబితాలో మార్పులు, చేర్పులు, అభ్యంతరాలు, కొత్త ఓటర్ల నమోదు, మృతి చెందిన ఓటర్లను తొలగింపు ప్రక్రియను చేపట్టారు. నియోజవర్గంలోని ఉంగుటూరు అత్యధికంగా, నిడమర్రు అత్యల్పంగా ఉన్నారు. ఓటర్ల జాబితాలను పోలింగ్ కేంద్రాల వద్ద ప్రదర్శించారు.

నేడు జాతీయ ఓటర్ల దినోత్సవం

ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామిక దేశంగా ఉన్న భారతదేశంలో అర్హులైన ప్రతి ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకునేలా ప్రోత్సహించే లక్ష్యంతో ఎన్నికల సంఘం ఏటా జనవరి 25న జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని నిర్వహిస్తుంది. ఓటు హక్కు, ప్రజాస్వామ్య వ్యవస్థపైనా ప్రజలు, యువతకు అవగాహన కల్పించే విధంగా ఎన్నికల సంఘం ప్రత్యేక కార్యక్రమాలను చేపడుతుంది. 2011 జనవరి 25వ తేదీ నుంచి ఓటర్ల దినోత్సవాన్ని నిర్వహిస్తుంది. నేను ఖచ్చితంగా ఓటు వేస్తాను, మీరూ ఓటు వేయండి నినాదంతో చేపడుతున్నారు. గ్రామాల్లో వ్యాసరచన, వక్తృత్వ, రంగవల్లుల, డ్రాయింగ్ పోటీలను నిర్వహిస్తున్నారు. సీనియర్ సిటిజన్లు, కొత్తగా ఓటు వచ్చిన యువకులను సత్కరిస్తున్నారు.

బోగస్ ఓటర్లకు చెక్

బోగస్ ఓటర్ల ఏరివేతకు ఫొటో సిమిలర్ ఎంట్రీస్ విధానాన్ని అవలంభించారు. ఓటర్ల జాబితాలో రెండు చోట్ల ఓట్లు కలిగిన వారిని గుర్తించి వాటిని తొలగించారు. ప్రతి ఓటరు ఫొటో ఆన్‌లైన్‌లో ఉండడంతో కొత్తగా ప్రవేశపెట్టిన సాంకేతికతో రెండు చోట్ల ఓటు హక్కు కలిగి ఉంటే వాటిని తొలగించారు. మృతి చెందిన ఓటర్లను తగిన ఆధారాలతో సరి చూసిన తర్వాతనే తొలగించారు. 2025 జనవరి నెల నాటికి 18 ఏళ్లు ఏళ్ల నిండిన వారికి కొత్త ఓటర్లగా జాబితాలో చేర్చారు,

అతివలదే నిర్ణయాధికారం

18 ఏళ్ల నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించి వారి ఓటు ద్వారా సుపరిపాలన అందించే ప్రభుత్వాన్ని ఎన్నుకోనున్నారు. నిర్ణయాధికారం మహిళల చేతుల్లోకి వెళ్లింది. ప్రజాప్రతినిధులుగా ఎన్నుకోబడుతున్న ఓటర్లలో మహిళల సంఖ్య ఎక్కువగా ఉండడంతో... రాజకీయ పార్టీలు వారికే పాలన పగ్గాలు అప్పగించనున్నారు. ఉంగుటూరు నియోజకవర్గంలో 2,06,506 మంది ఓటర్లలో పురుష ఓటర్లు 1,01,586 మంది. మహిళలు 1,04,914 మంది ఉన్నారు. దీనితో 3328 మంది మహిళలే అధికం. ఇతరులు ఆరుగురు ఉన్నారు. ఉంగుటూరులో ఐదుగురు, భీమడోలులో ఒకరు ఉన్నారు. మిగిలిన మండలాల్లో ఇతర ఓటర్లు లేరు. అదే విధంగా యువ ఓటర్లు 2,090 మంది, సర్వీసు ఓటర్లు 193 మంది ఉన్నారు. నియోజకవర్గంలో కొత్తగా చేరినవి 2,605 మంది కాగా 2,270 మందిని తొలగించారు.



భీమడోలులోని కళాశాలలో ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తున్న అధికారులు



ఓటర్ల జాబితాలను పోలింగ్ కేంద్రాల వద్ద ప్రదర్శించిన వీఆర్వో

ఉంగుటూరు నియోజకవర్గంలో ఓటర్ల వివరాలు

మండలం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
ఉంగుటూరు	31,389	32,536	05	63,930
భీమడోలు	25,816	27,190	01	53,007
నిడమర్రు	18,668	18,829	నిల్	37,497
గణపవరం	25,713	26,359	నిల్	52,072
మండలం	సర్వీసు ఓటర్లు	యూత్ ఓటర్లు	చేరికలు	తొలగింపులు
ఉంగుటూరు	82	667	659	694
భీమడోలు	50	507	808	462
నిడమర్రు	22	362	530	446
గణపవరం	39	554	608	668

ఓటరు దినోత్సవ పోటీల్లో ప్రతిభ

ఉంగుటూరు : ఓటరు దినోత్సవం సందర్భంగా జిల్లాస్థాయిలో ఏలూరులో నిర్వహించిన పోటీల్లో నారాయణపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు విజేతలుగా నిలిచారు. వారికి కళాశాల ప్రిన్సిపాల్ సర్టిఫికెట్లు అందజేసి అభినందించారు. ఐ ఓట్ ఫర్ ష్యూర్ అనే అంశంపై వ్యాసరచన, వక్తృత్వం పోటీలు ఏలూరు కోటదిబ్బమీద ఉన్న డిగ్రీ కళాశాలలో నిర్వహించారు. జిల్లాలోని అన్ని కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో కళాశాలకు చెందిన బీఏ మెదటి సంవత్సరం చదువుతున్న జి అనూష వ్యాసరచనలో ద్వితీయస్థానం జిల్లాస్థాయిలో సాధించారు. బీకాం విద్యార్థి బి సుమంత్ వక్తృత్వం పోటీలో జిల్లాస్థాయిలో మూడవ స్థానం బహుమతి గెలిచారు. వారిని ప్రిన్సిపల్ టీకే విశ్వేశ్వరరావు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆర్ట్స్ విభాగం అధ్యక్షుడు శ్రీమతి నిర్మల జ్యోతి, వైస్ ప్రిన్సిపాల్ రెడ్డయ్య, అకడమిక్ కో ఆర్డినేటరు డా.కొండ రవి, గాబ్రియేలు తదితరులు విద్యార్థులను అభినందించారు.

నేడు జాతీయ ఓటర్ల దినోత్సవం

దెందులూరు: దెందులూరు గారపాటి హైమావతి దేవి ఉన్నత పాఠశాలలో శనివారం జాతీయ ఓటర్ల దినోత్సవం నిర్వహించనున్నట్లు దెందులూరు తహసీల్దార్ బి సుమతి తెలిపారు. ఉదయం తహసీల్దార్ కార్యాలయం నుంచి అవగాహన ర్యాలీ బయలు దేరుతుందని పోలీస్‌స్టేషన్ లైబ్రరీ సెంటర్ బస్టాండ్ సెంటర్ మీదుగా ఉన్నత పాఠశాలకు చేరుకుని అనంతరం పాఠశాలలో అవగాహన సమావేశం సీనియర్ ఓటర్లకు సన్మానం ఇతర కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

ఓటు విలువను కాపాడుకుంటాను



గోపాలపురం నియోజకవర్గం ద్వారకాతిరుమల మండలం గోపాలపురం గ్రామం నాది. భీమడోలులోని ప్రైవేటు కళాశాలలో చదువుతున్నాను. నాకు 18 ఏళ్లు నిండడతో కొత్తగా ఓటు హక్కు కల్పించారు. చాలా సంతోషంగా ఉంది. ఈ ఓటును సమర్థవంతంగా పని చేసే పాలకులకు వేస్తాను. ఓటు విలువను కాపాడుకుంటాను.

– ఎం.సతీష్, కళాశాల సీఈసీ విద్యార్థి, సీఈసీ, గోపాలపురం

ఓటు వజ్రాయుధం



నేను భీమడోలులోని వృత్తి విద్యా కోర్సు చదువుతున్నాను. నాకు కొత్తగా ఓటు రావడం ఆనందంగా ఉంది. ఓటు వజ్రాయుధం. ప్రతి ఎన్నికల్లోనూ నిర్భయంగా, ఎటువంటి ఒత్తిళ్లకు ప్రభావితం కాకుండా ఓటు వేస్తాను.

– ఎం.శివసాయికుమార్, మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్ విద్యార్థి, పోలసానిపల్లి

ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తాం

ఉంగుటూరు నియోజకవర్గంలోని పోలింగ్ కేంద్రాల్లో జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసాం. సీనియర్ సిటిజన్లు, కొత్తగా ఓటు వచ్చిన యువ ఓటర్లను ఆహ్వానించి వారిని సత్కరిస్తాం. ఓటర్ల దినోత్సవం ప్రాధాన్యతపై అవగాహన కల్పిస్తాం.

– వై.పూర్ణచంద్ర ప్రసాద్, తహసీల్దార్, ఉంగుటూరు

గణతంత్ర వేడుకలకు ఏర్పాట్లు

ఉంగుటూరు: కై కరం హైస్కూల్లో గణతంత్ర దినోత్సవం వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు హెచ్ఎం గుళ్ల ప్రసాదరావు తెలిపారు. జెండా ఆవిష్కరణ, ఎన్‌సీసీ విద్యార్థులతో కవాతు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందని తెలిపారు. ఈనెల 26న ఉదయం 8 గంటల నుంచి 10.30 గంటలవ వరకు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తామని ప్రసాదరావు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులతో సాంస్కృతిక ప్రదర్శనలు ఆకర్షించనున్నా యని ఆయన పేర్కొన్నారు. గ్రామంలో పెద్దలు, ప్రజాప్రతినిధులు తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని హెచ్ఎం కోరారు.

రిపబ్లిక్ డే ఉత్సవాలకు ఏర్పాట్లు

దెందులూరు: భారత గణతంత్ర దినోత్సవం వేడుకలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఏలూరు పీఠం వికార్ జనరల్ సెయింట్ జాన్స్ విద్యా సంస్థల కరస్పాండెంట్ డాక్టర్ ఫాదర్ పి. బాల అన్నారు. శుక్రవారం సోమవారం సెయింట్ జాన్ డీఈడీ కళాశాలలో రిపబ్లిక్ డే వేడుకలు నిర్వహించేందుకు భారత దేశ పటాన్ని ప్రత్యేక శ్రద్ధతో రూపకల్పన చేయించారు. మండలంలో అన్ని ప్రభుత్వ కార్యాలయాలు స్వచ్ఛంద సంస్థలు రిపబ్లిక్ డే దినోత్సవం వేడుకలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.



దెందులూరు: భారతదేశ పటానికి రంగులు వేయిస్తున్న ఫాదర్ బాల

శానిటేషన్ సిబ్బంది నిరవధిక సమ్మె

దెందులూరు: దెందులూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్లో విధులు నిర్వహిస్తున్న శానిటేషన్ సిబ్బంది శుక్రవారం నుంచి నిరవధిక సమ్మె ప్రారంభించారు. నాలుగు నెలలు జీతాలు 18 నెలలు పీఎఫ్ బకాయిలు నేటికీ చెల్లించలేదని ఎన్నోసార్లు ప్రజాప్రతినిధులు ఉన్నతాధికారులకు వినతులు అందజేశామని సంఘ నాయకులు అనిల్ అన్నారు. ఎన్నిసార్లు చెప్పినప్పటికీ పెడచెవిన పెట్టారే తప్ప తమ సమస్యలు పరిష్కరించలేదని జీతాలు లేకపోతే తమపై ఆధారపడ్డ తమ కుటుంబ సభ్యుల జీవన విధానం ఎలా జరుగుతుందని ప్రశ్నించారు. ప్రజాప్రతినిధులు ఉన్నతాధికారులు స్పందించి పెండింగ్‌లో ఉన్న తమ జీతాలు పీఎఫ్ బకాయిలను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. జీతాలు రాకపోవడం తమ కుటుంబ సభ్యులు జీవన విధానం ప్రశ్నార్థకంగా మారిందని వారన్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో సమ్మె చేయాల్సి వస్తుందే తప్ప వైద్యశాలకు వచ్చే రోగులను ఇబ్బంది పెట్టే ఉద్దేశం తమకు లేదని ప్రజలు సహృదయంతో తమ ఇబ్బందులను అర్థం చేసుకోవాలని అనిల్ అన్నారు.



సమ్మె చేస్తున్న శానిటేషన్ సిబ్బంది

ఢిల్లీ గణతంత్ర వేడుకలకు సర్పంచ్‌కి ఆహ్వానం

పెదవేగి : పెదవేగి మండలం కొప్పుల వారి గూడెం గ్రామ పంచాయతీ సర్పంచ్ చలపాటి మణి సంజీవరావును ఈ నెల 26న ఢిల్లీలో నిర్వహించే 76 వ రిపబ్లిక్ దినోత్సవవేడుకల్లో గౌరవ అతిథిగా పాల్గొనాలని కేంద్ర ప్రభుత్వం ఆహ్వానించింది. వాటర్ కన్సర్వేషన్‌లో సర్పంచ్ చాలపాటి మణి కనబరచిన ప్రతిభను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం సర్పంచ్‌కు అరుదైన ప్రత్యేక ఆహ్వానం పలికింది. కేంద్ర ప్రభుత్వ ఆహ్వానం మేరకు సర్పంచ్ మణి 26న ఢిల్లీలో నిర్వహించనున్న రిపబ్లిక్ వేడుకల్లో పాల్గొననున్నారు.

ఓటు వజ్రాయుధం

పెదవేగి : ఓటు ప్రతిఒక్కరి చేతిలో వజ్రాయుధమని పెదవేగి ఇన్‌చార్జి తహసీల్దార్ భ్రమరాంబ అన్నారు. మెరుగైన సమాజ నిర్మాణం, ప్రజల హక్కులను జీవన విధానాలను పరిరక్షిస్తూ మానవ జాతి మనుగడకు భద్రత కల్పించడానికి సమాజంలో శాంతి భద్రతలు నెలకొల్పి సుపరిపాలన అందించే రాజకీయ పాలకులను ఎన్నుకోవడానికి ఓటు హక్కు వజ్రాయుధమని అన్నారు. రాజ్యాంగం 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించిందని తెలిపారు. ఓటు హక్కు విశిష్టతను విద్యార్థులకు తెలియజేసేందుకు జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా పెదవేగిలో శనివారం పలు కార్యక్రమాలు నిర్వహిస్తామని తహసీల్దార్ తెలిపారు. జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహిస్తామన్నారు.

నిత్య సహాయ మాత ప్రతిమతో ఊరేగింపు

దెందులూరు: పోతునూరులో నిత్య సహాయ మాత ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం నిత్య సహాయ మాత ప్రతిమతో ఆర్‌సీఎం చర్చి ఫాదర్ తంబీ రుంజల ఆధ్వర్యంలో పెదపాడు ఆర్‌సీఎం చర్చి ఫాదర్ మిల్క్ ఐయర్, ఫాదర్ డోమినిక్, ఫాదర్ బెన్హార్ హర్, సంఘస్తులు, సంఘ పెద్దలు యువత మరయదళ సభ్యులు, ఉపదేశీలు, ఉపాధ్యాయులు, చిన్నారులు, గ్రామస్తులు వీధుల్లో క్రైస్తవ గీతాలను ఆలపిస్తూ ర్యాలీ నిర్వహించారు. తొలుత ఆలయంలో దివ్యపూజా బలి అర్పించారు. శుక్రవారం గలెచ్చినగర్‌లో ఫాదర్ గలేభి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పేకాట స్థావరంపై దాడి

పెదవేగి : పేకాట స్థావరంపై దాడి చేసిన పోలీసులు 10 మంది వ్యక్తులను అదుపులోకి తీసుకుని రూ 83,500 నగదు స్వాధీనం చేసుకున్నారు. పెదవేగి ఎస్సై కె రామకృష్ణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెదవేగి మండలం విజయరాయిలో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో జూద శిబిరంపై పోలీసుల దాడి చేసి, పది మంది వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి 10 సెల్‌ఫోన్లు, రూ.83,500 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై చెప్పారు.

సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడొద్దు

భీమడోలు:సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడి తన బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని, సైబర్ నేరాలపై అవగాహన కలిగి అప్రమత్తంగా ఉండాలని జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ డి.నీలాద్రి అన్నారు. పోలసానిపల్లి గీతాంజలి డిగ్రీ కళాశాలలో శుక్రవారం సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్‌ఫర్మేషన్ ఆధ్వర్యంలో రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా డిపాజిటర్ ఎడ్యుకేషన్ అండ్ అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సదస్సుకు కళాశాల కరస్పాండెంట్ ఎం.గౌతమ్‌కుమార్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ డి.నీలాద్రి, ప్రాజెక్టు డైరెక్టర్ వి.ఆంజనేయులు, జిల్లా మేనేజర్ వి.అశోక్‌కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ డి. నీలాద్రి మాట్లాడుతూ సైబర్ నేరాల పట్ల అవగాహనపై రూపొందించిన బ్రోచర్లను వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నీలాద్రి మాట్లాడుతూ సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన కలిగి జాగ్రత్తగా ఉండాలని కోరారు. సైబర్ నేరాలపై నియంత్రణకు 1930కు కాల్ చేయాలని కోరారు. సోషల్ మీడియా, అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే కాల్స్, మోసపూరిత ఈమెయిల్స్ పట్ల అత్యంత జాగురుకతతో మెలగాలన్నారు. ప్రతి ఒక్కరూ బ్యాంకింగ్ సేవలను వినియోగించుకోవాలన్నారు. ఆర్థిక అక్షరాస్యతను కలిగి ఉండాలని, బ్యాంకు ఉత్పత్తులను ఉపయోగించాలన్నారు. ఈ కార్యక్రమంలో కెనరా బ్యాంకు భీమడోలు మేనేజర్ బి. శివకృష్ణ, మేనేజర్ శ్రీనివాసరావు, వైవీ నాయుడు, ఆర్‌పీలు బాబూరావు, అనిల్, చిన్నారావు, శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.



సైబర్ నేరాలపై బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ డి.నీలాద్రి

పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలి

భీమడోలు: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు ఉపాధ్యాయులు తమ వంతు కృషి చేయాలని భీమడోలు మండల ప్రత్యేకాధికారి, జిల్లా బీసీ సాంఘిక సంక్షేమాధికారిణి ఆర్‌వీ నాగ రాణి కోరారు. భీమడోలు, పోలసానిపల్లిలోని ప్రభుత్వ పాఠశాలలను ఎంఈవో ఈదుపల్లి శ్రీనివాసరావుతో కలిసి ఆమె శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేసారు. పాఠశాలల పునఃవ్యవస్తీకరణలో భాగంగా తరగతులు విలీనం కానున్న నేపథ్యంలో అక్కడ తరగతి గదుల సంఖ్య, మౌలిక వసతుల కల్పనపై ఉపాధ్యాయుల నుంచి ఆమె ఆరా తీసారు. తరగతి గదుల్లో తరగతుల వారీగా విద్యార్థుల వివరాలను పరిశీలించారు. విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న కార్యక్రమాలను సమర్ధవంతంగా నిర్వహించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉండే విద్యార్థుల సంఖ్యను పెంచాలని కోరారు. ప్రతి ఇంటినీ టీచర్లు సందర్శించి తల్లిదండ్రులను ఒప్పించి చిన్నారులను పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. పాఠశాలల పునః వ్యవస్తీకరణలో భాగంగా ఏర్పడే మోడల్, బేసిక్, ఫౌండేషన్ పాఠశాలల ఏర్పాటుపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎంలు జి.బాలభాస్కర్, బుల్లిదొర, కె.తులసి, జయశ్రీ, సీఆర్‌ఎంటీలు రాధాకృష్ణ, సత్యప్రసాద్, సీహెచ్ రమణ పాల్గొన్నారు.



పాఠశాలలో టీచర్లతో మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారిణి ఆర్‌వీ నాగరాణి

వివక్ష లేని సమాజ స్థాపనే లక్ష్యం

భీమడోలు: ఆడపిల్లల వివక్షత లేని సమాజ స్థాపనే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని గుండుగొలను–1 పాఠశాల హెచ్ఎం పాశం పాండురంగారావు అన్నారు. గుండుగొలను–1 ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం జాతీయ బాలిక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బేటీ బచావో, బేటీ పఢావో నినాదంతో పలు కార్యక్రమాలను నిర్వహించారు. చిన్నారులకు వివిధ పోటీలు నిర్వహించి బహుమతులను అందించారు. బాలికల హక్కులపై అవగాహన కల్పించారు. ప్లకార్డులను చేతపట్టుకుని నినాదాలు చేసారు. ఈ కార్యక్రమంలో టీచర్లు పాల్గొన్నారు.

ఉంగుటూరు హైస్కూల్లో బాలికల దినోత్సవం

ఉంగుటూరు: ఆడపిల్లలు చిన్న వయస్సులో వివాహం చేసుకోవద్దని, ఉన్నత విద్యను అభ్యసించాలని ఉంగుటూరు ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి అన్నారు. శుక్రవారం ఉంగుటూరు హైస్కూలు వద్ద జాతీయ బాలికల దినోత్సవం నిర్వహించారు. సర్పంచి బండారు సింధు, అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో హెచ్ఎంతోపాటు, సూపర్ వైజరు శ్రీలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు విద్యార్థులు పాల్గొన్నారు. హైస్కూలు వద్ద నుంచి ర్యాలీ నిర్వహించారు.

ఘనంగా జాతీయ బాలికా దినోత్సవం

దెందులూరు: నిరంతర సాధన ప్రణాళిక, ఏకాగ్రతతో బాలికలు ఏదైనా సాధించవచ్చని కొవ్వలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు జీఎస్ఎల్ఎన్ శర్మ పోతునూరు అంగన్‌వాడీ సెక్టర్ సూపర్ వైజర్ శ్రీదేవి అన్నారు. శుక్రవారం జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా స్త్రీ శిశు సంక్షేమ శాఖ పోతునూరు సెక్టార్ సూపర్‌వైజర్ శ్రీదేవి ఆధ్వర్యంలో కొవ్వలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బస్టాండ్ సెంటర్‌లో ర్యాలీ నిర్వహించారు. దెందులూరులో ఐసీడీఎస్ సెక్టార్ సూపర్‌వైజర్ చిట్టమ్మ, బాలికల ఉన్నత పాఠశాల హెచ్ఎం శ్రీదేవి ఆధ్వర్యంలో అంగన్‌వాడీ టీచర్లు ర్యాలీ నిర్వహించి బాలికల విధులు బాధ్యతలు లక్ష్యాలను వివరించారు. ప్రభుత్వం బాలికల సంపూర్ణ ఆరోగ్య పరిరక్షణ అభివృద్ధి భద్రత భవిష్యత్తు లక్ష్యంగా అమలు చేస్తున్న కార్యక్రమాలను సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అంగన్‌వాడీ టీచర్లు రంగమ్మ, లక్ష్మి, ధన శైలజ, సరోజిని, శ్రీదేవి, గాయత్రి, నాగవేణ, దేవి, విజయ, విద్యార్థులు పాల్గొన్నారు.



గుండుగొలనులో ప్లకార్డులతో నినాదాలు చేస్తున్న బాలికలు, టీచర్లు



ఉంగుటూరు హైస్కూల్ విద్యార్థులతో ర్యాలీ నిర్వహించిన దృశ్యం



దెందులూరు: జాతీయ బాలికా దినోత్సవంలో ప్రతిజ్ఞ చేయిస్తున్న టీచర్లు

ఉపన్యాస పోటీల్లో గురుకుల విద్యార్థుల ప్రతిభ

పెదపాడు : జాతీయ ఓటర్ల దినోత్సవం పురస్కరించుకుని ఏలూరులోని జూనియర్ కళాశాలలో ఆర్‌ఐఓ కార్యాలయం వద్ద నిర్వహించిన ఉపన్యాస పోటీల్లో వట్లూరు గురుకుల పాఠశాల విద్యార్థులు విజేతలుగా నిలిచారు.ఈ పోటీల్లో ఇంటర్ విద్యార్థి జి జాన్ జోషిత జిల్లాస్థాయిలో రెండవ స్థానం సాధించింది. ప్రిన్సిపాల్ దాసరి మేరీ ఝాన్సీరాణి విద్యార్థులను అభినందించారు.